www.prajasakti.com

బుధవారం 5 జులై 2023 5 పశ్చిమ గోదావరి



గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించాలని ధర్నా


ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నర్సాపూర్ నుండి గుంటూరు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును పునరుద్ధరించాలని సిపిఎం ఆధ్వర్యంలో నరసాపురం రైల్వేస్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. స్టేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ నరసాపురం నుండి గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ను గత నెల 13 నుంచి ట్రాక్ మరమ్మతుల పేరుతో రద్దు చేశారని, ఇప్పటికీ రైలు పునరుద్ధరించకపోవడం దారుణమని అన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఈ రైలును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, నేతలు పొన్నాడ రాము, పొగాకు నారాయణరావు, నోముల కొండ, జల్లి రామ్మోహన్‌రావు, గుబ్బల చిన్ని, కవురు నరసింహస్వామి పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తిని కొనసాగించాలి : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకు

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ స్ఫూర్తిని కొనసాగించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం అల్లూరి 126వ జయంతి సందర్భంగా స్థానిక బ్యాంక్ కాలనీలోని క్షత్రియ కళ్యాణ మండపం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గిరిజనుల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన మహనీయుడు అల్లూరి అని అన్నారు. క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు భూపతిరాజు వరాహ లక్ష్మీనారాయణరాజు, కార్యదర్శి సుబ్బరాజు, కోశాధికారి శ్రీనివాసరాజు, డాక్టర్ సుందర రామరాజు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి

అల్లూరి పోరాట పటిమ స్ఫూర్తిదాయకం: జెసి

భీమవరం: భారత స్వాతంత్రోద్యమంలో అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో అల్లూరి జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జెసి రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఎఎస్‌పి ఎవి.సుబ్బరాజు పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామంలో వెన్నుచూపని విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. నేటి సమాజం వారి పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖాధికారి జివిఆర్‌కెఎస్‌ఎస్.గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, డిఎస్‌పి బి.శ్రీనాథ్, వివిధ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం, నేతలు, కార్మికులు

అల్లూరి స్ఫూర్తితో ప్రజావ్యతిరేక విధానాలపై పోరు

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

ప్రజాశక్తి - భీమవరం

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతిని ప్రకాశంచౌక్‌లో అల్లూరి సీతారామరాజు స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అల్లూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి బి బలరాం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జయంతిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూతూ పొడుస్తుందని విమర్శించారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన సీతారామరాజు బ్రిటీష్ వారికి లొంగకుండా తృణప్రాయంగా ప్రాణాలర్పిస్తే నేడు బిజెపి పాలకులు గిరిజనుల ప్రాణాలు బలిగొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ముంపులో ఉన్న గిరిజనులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల మునుగుతున్న 193 గ్రామాల గిరిజన ప్రజలను నేటికీ ఆదుకోలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య విభజన తీసుకొస్తూ మత విద్వేషాలు రెచ్చగొడుతుందని విమర్శించారు. ప్రభుత్వ పరిశ్రమలు మూసి వేసి నిరుద్యోగం పెంచుతున్న పాలకవర్గాలు ఉపాధి అవకాశాలు మాత్రం పెంచట్లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున పోరాడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచుతుందని, ధరా భారంతో ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ధరల అదుపునకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అల్లూరి స్ఫూర్తితో పెద్దఎత్తున పోరాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, బొక్కా సత్యనారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, బి.చైతన్య ప్రసాద్, డి.నాగు, కలిపిండి సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం: బానిసత్వంలో మగ్గుతున్న దేశానికి స్వరాజ్యం, సమసమాజం తీసుకురావాలని చిన్న వయస్సులోనే సామ్రాజ్యవాద, వలసవాద ప్రభుత్వమైన బ్రిటీష్ పాలకులపై సాయుధ పోరాటం చేసిన తొలితరం నాయకుల్లో అల్లూరి సీతారామరాజు ఒకరని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ బి.బలరాం అన్నారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం) వద్ద అల్లూరి 126వ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన అల్లూరి విప్లవజ్యోతిగా, త్యాగశీలిగా అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. అల్లూరికి, ఆయనతో కలిసి పోరాటం చేసిన మేగిరాజు అగ్గిరాజు, గంటం దొర, మల్లుదొర తదితర ఉద్యమకారులకు, అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. భీమవరం ఆర్యస్తా కళాకారుల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు సి.హెచ్.మోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవకారులు ఎంత ధైర్యంతో, చైతన్యంతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చేందుకు కృషి చేశారని, వారిలో అల్లూరి ఒకరని అన్నారు. ఈ సందర్భంగా కళాకారులు తెలుగువీర లేవరా.. దీక్షబూని సాగరా అనే గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో వి.రాధాకృష్ణ, జి.రఘురాములు, ఆర్యస్తా అసోసియేషన్ అధ్యక్షులు జి.చక్రవర్తి, పి.రాజేష్, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల అల్లూరి వేషధారణ

భీమవరం రూరల్: అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా విశ్వశాంతి స్కూల్ విద్యార్థులు మంగళవారం అల్లూరి సీతారామరాజు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. మెడలో యజ్ఞోపవీతం.. నుదుట కుంకుమ తిలకం.. రాచరికపు పంచికట్టుతో చేతిలో విల్లు పట్టుకుని అల్లూరిని మరిపించేలా చిన్నారుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. భీమవరం అడ్డ వంతెన నుంచి అల్లూరి సీతారామరాజు 30 అడుగుల కాంస్య విగ్రహం వరకు ఆ చిన్నారులు ర్యాలీ నిర్వహించారు.

స్ఫూర్తిదాయకులు అల్లూరు సత్యనారాయణ

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

ఘనంగా అల్లూరు వర్ధంతి

ప్రజాశక్తి - భీమవరం

భూస్వామ్య కుటుంబంలో పుట్టి చివరి వరకు కార్మికవర్గ రాజ్యాధికారం కోసం తపిస్తూ.. కృషి చేసిన కార్మిక నేత అల్లూరు సత్యనారాయణను స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు కార్యాలయంలో అల్లూరు సత్యనారాయణ వర్ధంతి సభ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఏ చట్టాలు లేని రోజుల్లో కార్మికులందరినీ సంఘంలో చేర్చి హక్కుల కోసం పోరాడి కార్మికుల సమస్యల పరిష్కారానికి అల్లూరు కృషి చేశారన్నారు. జిల్లాలో రైస్‌మిల్లు, బజారు, అసంఘటితరంగ సంఘాలను బలంగా నిర్మించడంలో అల్లూరు పాత్ర గొప్పదన్నారు. 74 రోజుల సమ్మెలో కార్మికులను ఐక్యంగా నిలిపి, పోరాటం నడిపిన ఘనత ఆయన సొంతమన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడి సాధించుకున్న చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు పని భద్రత లేకుండాపోయిందన్నారు. ఉన్న చట్టాలను యజమానులకు చుట్టాలుగా మారుస్తున్నారని విమర్శించారు. కార్మికుల హక్కులు, చట్టాల పరిరక్షణకు ఐక్య పోరాటాలతో ముందుకు సాగాలని, అదే అల్లూరుకు ఘనమైన నివాళులని అన్నారు. ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు అల్లూరు నిర్వహించారన్నారు. రానున్న రోజుల్లో అల్లూరు సత్యనారాయణ స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నేతలు కలిపిండి సత్యనారాయణ, డి.నాగేశ్వరరావు, షేక్ వలీ, ఎం.ఆంజనేయులు, రంగా, కె.సోమేశ్వరరావు, వైకుంఠరావు, డి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

తణుకు రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం సాగించిన ధన్యజీవి అల్లూరు సత్యనారాయణ అని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. మంగళవారం స్థానిక అమరవీరుల భవనంలో అల్లూరు సత్యనారాయణ తొమ్మిదో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడగా గుబ్బల గోపి, అజయకుమారి, కామన మునిస్వామి, గార రంగారావు, టి.వెంకటేశ్వరరావు, వీర్రాజు, కృష్ణవంశీ, సీతారామయ్య పాల్గొన్నారు.



అల్లూరి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

పాలకొల్లు: కార్మిక నేత అల్లూరు సత్యనారాయణ జీవితం అందరికీ ఆదర్శనీయమని మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. మంగళవారం అల్లూరు వర్ధంతి సందర్భంగా సిపిఎం నేత వలవల శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విప్లవ వీరుడు అల్లూరి జయంతి సభ నిర్వహించారు. ఈ సభకు చల్లా సోమేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమాల్లో యర్రా కృష్ణారావు, అజయ్‌కుమార్, జానకి, ఝాన్సీ పాల్గొన్నారు.

ఆచంట: అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడటమే విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు, కార్మికోద్యమ నేత అల్లూరు సత్యనారాయణలకు ఘన నివాళి అని సిపిఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నర్సింహమూర్తి, ఎస్‌విఎన్.శర్మ, వద్దిపర్తి అంజిబాబు అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మహనీయులకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తోటపల్లి సత్యనారాయణ, నెక్కంటి కృష్ణమూర్తి, తలుపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, కొండేటి రాఘవులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు పట్టణాధ్యక్షులు జవ్వాది శ్రీను అధ్యక్షతన అల్లూరు సత్యనారాయణ వర్ధంతి, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సభ నిర్వహించారు. తొలుత అల్లూరు సత్యనారాయణ చిత్రపటానికి గొన్నాబత్తుల నాగేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కర్రి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, సిఐటియు పట్టణ గౌరవాధ్యక్షులు గొన్నాబత్తుల నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో నరమాల కృష్ణ, చిటికిన రాము, మేట్రెడ్డి రమణ, గొర్రెల సతీష్‌కుమార్, మడక రాజు, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోడూరు: అల్లూరు సత్యనారాయణ ఆదర్శనీయులని సిఐటియు నాయకులు పిల్లి ప్రసాద్ అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో పోడూరు పిహెచ్‌సి వద్ద అల్లూరు వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో సాయిలక్ష్మి, అమ్మాజీ, పల్లె శ్రీదేవి, గొల్ల సుజాత, బి.వెంకట్రావు, కాకర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: కార్మికోద్యమ నేత అల్లూరు సత్యనారాయణ వర్ధంతి సభ స్థానిక మీరా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు పొన్నాడ రాము, మంచిలి నీలకంఠం, పొగాకు నారాయణరావు, నోముల కొండ, గుబ్బల నాగేశ్వరరావు, చిన్ని, జల్లి రామ్మోహన్‌రావు, బోడసింగ్ అప్పారావు, పొన్నాడ మల్లేష్, సత్తిబాబు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి: సిపిఎం సీనియర్ నాయకులు అల్లూరు సత్యనారాయణ చిరస్మరణీయుడని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బాతిరెడ్డి జార్జి అన్నారు. గ్రామం అమరవీరుల స్మారక భవనంలో అల్లూరు తొమ్మిదో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షత వహించగా జార్జి మాట్లాడారు. నేతలు మాసవరపు సుబ్బారావు, గొల్ల ఏడుకొండలు, శ్రీనివాస్, కేతా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల తొలగింపును ఆపాలి

కలెక్టరేట్ వద్ద ఎపి పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నో ఏళ్ల నుంచి పంచాయతీ కార్మికులుగా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న కార్మికులను తొలగించే ఆలోచన సరైంది కాదని, తక్షణం దీన్ని విరమించుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. పంచాయతీ కార్మికులపై వేధింపులు, తొలగింపులు ఆపాలని, సమస్యలు పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇంటి వెంకటేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ పెనుగొండ మండలం ములపర్రు, పాలకోడేరు మండలం మోగల్లు గ్రామాల్లో గత 15 ఏళ్లుగా పని చేస్తున్న ట్యాంక్ వాచర్లు, ఎలక్ట్రీషియన్లను పనిలోకి రావొద్దని, కొత్త వారిని పెట్టుకుంటామని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. గత 15 ఏళ్ల నుంచి పని చేస్తున్న వారిని పనిలోంచి తీసివేస్తే వారి కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం గతం నుంచి ఎవరైతే పని చేస్తున్నారో టెండర్‌తో నిమిత్తం లేకుండా వారినే కొనసాగించాల్సి ఉన్నప్పటికీ కార్మికులపై ఇలా వేధింపులకు దిగడం సరికాదన్నారు. జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లాలో కొన్ని పంచాయతీల్లో వేతన బకాయిలు ఉన్నాయని, యూనిఫారాలు, చెప్పులు, ఆయిల్, సబ్బులు, గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అమలు జరగడం లేదన్నారు. పంచాయతీల్లో వివిధ రకాల సేవలను ప్రజలకు అందిస్తున్న కార్మికులపై బెదిరింపులు, తొలగింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని, కనీస వేతనాలు అమలు చేయాలని వారు కోరారు. అనంతరం డిపిఒ కార్యాలయ ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకోడేరు మండల నాయకులు కృష్ణంరాజు, అత్తిలి మండల నాయకులు గిరి, పెనుగొండ మండల నాయకులు నాగార్జున, బాబు పాల్గొన్నారు.



డిపిఒ కార్యాలయ ఎఒకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నేతలు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి - తణుకు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే సాధ్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకు పురపాలక సంఘం పరిధిలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాల విద్యార్థులకు 15 వేల రూపాయలు ఇవ్వడం సామాన్య విషయం కాదన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు ఇంగ్లీషులో నైపుణ్యం సాధించేలా పాఠశాలలో ఆంగ్ల విద్యను ప్రవేశ పెట్టామన్నారు. అనంతరం నాలుగో విడత అమ్మఒడి కింద తణుకు పురపాలక సంఘం పరిధి, మండలం వివిధ పాఠశాలలో పదివేల తొమ్మిది వందల ఆరుగురు తల్లులకు రూ.14 కోట్ల 17 లక్షల 75 వేల నమూనా చెక్కును మంత్రి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలో ఎస్‌ఎస్‌సిలో మొదటి ర్యాంకు వచ్చిన సబిహాకు ఆణిముత్యాలు ప్రోత్సాహం, కారుమూరి ట్రస్ట్ రూ.35000తో కలిసి లక్ష రూపాయలు ఫిక్స్ డిపాజిట్ చేసిన పత్రాలు మంత్రి కలెక్టర్ సమక్షంలో విద్యార్థినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ చెర్ల పద్మశ్రీ, డిఇఒ ఆర్.వెంకటరమణ, కమిషనర్ కెటి.సుధాకర్ పాల్గొన్నారు.

ఉండి: విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతిస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మంగళవారం అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమాన్ని మహదేవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ ఎ.రవీంద్ర అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల చదువు కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చిందని, ప్రతి విద్యార్థీ ఈ పథకాలను వినియోగించుకుని చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లల చదువు భారం కాకూడదనే ఉద్దేశంతో వరుసగా నాలుగో సంవత్సరం అమ్మ ఒడి కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా 15 వేల రూపాయలు నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గుత్తుల కనకమహాలక్ష్మి, కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, గ్రామ ఉపసర్పంచి ముదునూరి సుబ్బరాజు, రూరల్ బ్యాంకు త్రిసభ్య కమిటీ ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణ రాజు, మండల అధ్యక్షులు పివిఆర్ కె.ఆంజనేయరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణల నుంచి బాపిరాజు చెరువును కాపాడండి

బిసి నేత నరసింహులు నిరసన

ప్రజాశక్తి - ఉండి

కబ్జా కోరల్లో ఉన్న బాపిరాజు చెరువును కాపాడి గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకోవాలని బిసి నాయకులు గేదెల నరసింహులు మంగళవారం ఉదయం బాపిరాజు చెరువులో దిగి నిరసన చేపట్టారు. చెరువును గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకోవాలని ఆరేళ్లుగా పోరాడుతున్నా అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదని నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పెత్తందారులకు దాసోహం చేస్తూ గ్రామంలోని ప్రజలకు తీరని అన్యాయం చేస్తూ నియంతలా వ్యవహరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దపుల్లేరు గ్రామం నడిబొడ్డిలో గ్రామపంచాయతీకి చెందిన 53 సెంట్లు కలిగిన బాపిరాజు తాగునీటి చెరువు కబ్జా కోరల్లో ఉందని, మే 15న స్పందనలో ఫిర్యాదు చేసినా గ్రామపంచాయతీ కార్యదర్శి పట్టించుకోకుండా ఫిర్యాదును చెత్తబుట్టలో పారేశాడని వాపోయారు. స్పందన ఫిర్యాదును సైతం ధిక్కరిస్తూ బడా బాబులకు ఊడిగం చేస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాను దీక్ష విరమించేది లేదని, చెరువును శుభ్రం చేసి పంచాయతీ స్వాధీనం పర్చుకునే వరకూ తన దీక్ష ఆగదని తెలిపారు.

మహిళలపై దాడులను అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి - పెనుగొండ

దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు ఎస్.పుణ్యవతి అన్నారు. మంగళవారం పెనుగొండలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు జరిగిన శిక్షణా తరగతుల్లో ముఖ్య అతిథిగా పుణ్యవతి పాల్గొని మాట్లాడారు. మహిళల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వల్ల హింస, అసమానతలు, వేధింపులు కొనసాగుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు హింసను అరికట్టే వరకూ మహిళలు పోరు సాగించాలని తెలిపారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో 'మహిళల పోరు యాత్ర' చేపడుతున్నట్లు తెలిపారు. ముందుగా సభలో మహిళా సంఘం నాయకురాలు మాచికొండ సూర్యావతి వర్ధంతి సందర్భంగా సభ్యులు సంతాపం తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.పూర్ణ మాట్లాడుతూ మహిళలు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేయాలన్నారు. పిల్లలను బాగా చదివించి వారి కాళ్లపై వారు నిలబడిన తర్వాత మాత్రమే పెళ్లిళ్లు చేయాలన్నారు. ఆనాడు మాచికొండ సూర్యావతి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.పద్మజ, ట్రెజరర్ జయప్రభ, ఐద్వా రాష్ట్ర సభ్యురాలు ఎస్.ఉదయకుమారి, మహిళలు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలపై నేరాల నియంత్రణకు కృషి : జెసి

భీమవరం :షెడ్యూల్డ్ కులాలు, తెగలపై అఘాయిత్యాలు, నేరాలు నిరోధించేందుకు సంబంధిత అధికారులు, సభ్యులు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లో పౌర హక్కుల రక్షణ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు అట్రాసిటీల నిరోధక చట్టాల అమలు తీరుపై సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులతో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశం జెసి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టిల రక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలు నూరుశాతం అమలు జరగాలన్నారు. సంబంధిత వర్గాలకు సంబంధించిన కేసుల విషయంలో అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ మహిళపై అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అడిషనల్ ఎస్‌పి ఎవి సుబ్బరాజు సుబ్బరాజు, కమిటీ సభ్యులు జిల్లెళ్ల సత్య సుధామ, పొన్నమండ బాలకృష్ణ, డాక్టర్ సిఎం మంగరాజు, తెన్నేటి జగజ్జీవనరావు, సింగం త్రిమూర్తులు, సిహెచ్‌విఆర్.భరత్, తోటకూర వెంకట సుబ్బరాజు మాట్లాడారు. సమస్యలను కమిటీ దృష్టికి తీకొచ్చారు. బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం మాధవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ సర్దుబాటు ఛార్జీల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై జనం నెత్తిన మోయలేని భారాలు మోపడం దారుణమన్నారు. తక్షణం పెంచిన ఛార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పురిటిగడ్డ జయమ్మ, గుత్తుల నరసయ్య, నిచ్చెనకోళ్ల రాముడు, గోపాల వెంకటరావు, చినమర్తి కనకరాజు, గుత్తుల సత్యవతి, నిచ్చెనకోళ్ల లక్ష్మణకుమారి, మల్లుల పరమేశుతదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రుల్లో నూరు శాతం డెలివరీలు చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం


ఏరియా ఆసుపత్రుల్లో నూరు శాతం డెలివరీలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత సూపరింటెండెంట్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో వైద్య శాఖాధికారులతో ఆమె సమీక్షించారు. కొన్ని ఏరియా ఆసుపత్రుల్లో హెచ్‌డిఎస్ నిధుల వినియోగం తక్కువగా ఉందని, నిధులు ఖర్చు చేసి ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు, ఇతరత్రా సమకూర్చుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తణుకు ఏరియా హాస్పిటల్‌లో డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎంతమంది డాక్టర్లు పని చేస్తున్నారు, ఎన్ని ఖాళీలు ఉన్నాయి తదితర విషయాలపై సమీక్షించారు. సొంతంగా బ్లడ్ బ్యాంక్ ఉందా, వాటికి బ్లడ్ యూనిట్స్ ఎక్కడి నుంచి సరఫరా జరుగుతుంది, ఎన్ని యూనిట్లు నిల్వ సామర్థ్యం ఉంది అని ప్రశ్నించారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు, డిసిహెచ్‌ఎస్ వీరాస్వామి, డిఐఒ దేవసుధ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

అభినందించిన డిఎన్‌ఆర్ పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు

ప్రజాశక్తి - భీమవరం

అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని తమ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని డిఎన్‌ఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు జివి. నరసింహారాజు, గాదిరాజు సత్యనారాయణరాజు అన్నారు. డిఎన్‌ఆర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీను అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు 126వ జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నర్సింహరాజు, సత్యనారాయణరాజు ప్రారంభించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి వీరోచితమైన పోరాటం చేశారని, ఆయన పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కుల, మత, ఆర్థిక అసమానతలు, దోపిడీ లేని సమాజం కోసం పోరాడాలని, అదే అల్లూరికి మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. శిబిరంలో 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.శాంతకుమారి, అధ్యాపకులు, ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నాయకులు వి.భానుప్రకాష్, బి గణేష్, పి.శాంతి, ఎస్.లక్ష్మణరావు, ఎం.నాగేంద్ర, యు.వినోద్ పాల్గొన్నారు.



డిఎన్‌ఆర్ పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు నరసింహరాజు, సత్యనారాయణరాజు

అందరివాడు వంగవీటి : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకు

అందరివాడు వంగవీటి మోహనరంగా అని రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. రంగా జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు మంగిన సూర్య, నాయకులు పాల్గొన్నారు. అలాగే టిడిపి పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, నాయకులు వంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జనసేన తణుకు నియోజకవర్గ ఇంచార్జ్ విడివాడ రామచంద్రరావు, జనసైనికులు రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

కాళ్ల:వంగవీటి రంగా ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఏలూరుపాడు సర్పంచి చిన్నారావు రాంబాబు తెలిపారు. మండలంలో ఏలూరుపాడు, కాళ్ళ, దొడ్డనపూడి, సీసలి గ్రామాల్లో వంగవీటి మోహనరంగా 76వ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వక్కపట్ల హరిబాబు, వెంకటేశ్వరరావు, ఆరేటి దిలీప్, గంటా బాబు పాల్గొన్నారు.

పాలకొల్లు : పేద, బడుగు వర్గాల ప్రజలకు అండగా వంగవీటి మోహనరంగా నిలిచారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు మారుతి థియేటర్ వద్ద వంగవీటి రంగా విగ్రహానికి ఆయన మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ బాబ్జి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడారు. అలాగే ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు, ఉన్నమట్ల కబర్ది రంగా విగ్రహానికి పూలమాలలు వేశారు.

తాడేపల్లిగూడెం : మాజీ ఎంఎల్ఎ ఈలి నాని ఆధ్వర్యంలో తణుకు రోడ్డులో వంగవీటి రంగా విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈలి నాని మాట్లాడారు. కాపులు, బలహీనవర్గాల ఉన్నతికి రంగా విశేష కృషి చేశారన్నారు. అలాగే ఆర్‌టిసి డిపో వద్ద అల్లూరి సీతారామరాజు జయంతిని క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు చెరుకువాడ అప్పల రామకృష్ణ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వర్షపు నీరు వెళ్లేలా ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. ఏలూరుపాడు గ్రామ పంచాయతీ గరువు ప్రాంతంలో పల్లపు రోడ్డు జలమయం అయ్యింది. వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆ ప్రాంత వాసులు అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎంపిటిసి రాంబాబు, నవీనావు గ్రామ సర్పంచి కొల్లి నాగమోహిని మంగళవారం పరిస్థితిని పరిశీలించారు. వర్షపు నీరు వెళ్లేలా పంచాయతీ నిధులతో పివిసి పైపుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు.

పెరటి తోటలు పెంచండి

వీరవాసరం:ప్రతి ఒక్కరూ పెరటి తోటలు పెంచుకుని కూరగాయల కొరతను అధిగమించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా కో ఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. నవుడూరులో ఆర్‌బికె వద్ద మంగళవారం డ్వాక్రా మహిళా కిచెన్ గార్డెన్ విత్తనాల ప్యాక్ చేయించే కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయనాలతో కాకుండా కూరగాయలను పండించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఈఓ పి.అశోక్‌కుమార్, మండల ఇన్‌ఛార్జులు దేవి నాగరాజు, వీరోలకుమార్, వివిఎ రామాలి, ఐసీఆర్‌పిలు అంబేద్కర్, నాగరాజు, నవీన్‌కుమార్, ఎస్‌ఎస్‌జి మహిళలు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమవరం బార్ అసోసియేషన్ ఐఎఎల్ ఆధ్వర్యంలో మంగళవారం ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ న్యాయవాదుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ ఎం.రమణారావు, కార్యదర్శి పాకా రమేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సిలో ఆశా డే సందర్భంగా డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయుష్ డాక్టర్ జి.భవానీ ప్రసాద్ ప్రకృతి వైద్యంపై ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లకు, ఆశలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంట్లో వాడుకునే కొన్ని ప్రకృతి సిద్ధమైన వనమూలికలతో అనేక రోగాలను తగ్గించుకోవచ్చని డాక్టర్ భవానీ ప్రసాద్ తెలిపారు. అనంతరం ఆశా కార్యకర్తలకు 15 రకాల ఆయుష్ పౌడర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కె.ప్రభాకర్, పిహెచ్‌ఎన్ పి.ఎలిజబెత్ పాల్గొన్నారు.

ఎండియు వాహన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎండియు వాహనాల నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని మండల ఎండియు వాహనాల సిబ్బంది అధికారులను కోరారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ అధికారి శేషయ్యకు వాహనాల సిబ్బంది వినతి పత్రాలను అందజేసి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో వాహన నిర్వాహకులు చింతపల్లి చిన్న వెంకట సత్యనారాయణ (చిన్న) జి.కనకారావు, వై.వెంకటేష్, ఎస్.కామేష్ ఉన్నారు.

నేరాలు.. ఘోరాలు..

చిట్టీల పేరుతో మోసం

మహిళపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి

చిట్టీల పేరుతో మోసం చేసిన మహిళపై పోలీసు కేసు నమోదైన సంఘటన ఉండిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కె.గంగాధరరావు వివరాలు తెలిపారు. ఉండికి చెందిన ఇర్రింకి గంగారత్నం గ్రామంలో కొన్ని సంవత్సరాల నుండి చిట్టీల వ్యాపారం నిర్వహించేది. సుమారు 15 లక్షల రూపాయల వరకూ తనకు, తోటి మహిళలకు నగదు ఇవ్వాల్సి ఉందని మంగళవారం గంగారత్నంపై నవీపల్లి భవాని ఫిర్యాదు చేసిందని తెలిపారు. గంగారత్నంపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

బైక్‌పై వెళుతున్న యువకుడిని లారీ ఢీ కొట్టిన సంఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆలమూరు కాలువ దగ్గర మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం పసలపూడి చెందిన యువకుడు పోతంశెట్టి వెంకట బసివిరెడ్డి (23) ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. మంగళవారం తెల్లవారుజామున బసివిరెడ్డి బైక్‌పై భీమవరం వెళ్తుండగా మార్టేరు నుంచి ఆలమూరు వెళ్లే రోడ్డులో కాలువ చెరువు వంతెన దగ్గరికి వచ్చేసరికి లారీ ఢీకొంది. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు వివరాలను ఆలమూరు విలేజ్ శ్రీనివాస్ నమోదు చేశారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వడ్డిగూడెంలో చోరీ

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పోలీస్ స్టేషన్ పరిధి వడ్డిగూడెంలో పట్టపగలు ఇంటిలో చోరీ జరిగింది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో జరిగింది. దుండగులు ఇంటి వెనుక భాగంలో ఉన్న తలుపును బద్దలు కొట్టి లోనికి ప్రవేశించి బీరువాలోని నాలుగు కాసులు బంగారు వస్తువులు, కొంత నగదు దొంగ ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. సైదు ఏసుమణి వాలంటీర్‌గా పని చేస్తోంది. ఆమె భర్త ఫ్రాన్సిస్‌కుమార్ వేరే పనిపై బయటకు వెళ్లగా వారు లేని సమయం చూసుకుని ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రమేష్ సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

అల్లూరి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పెట్టాలి

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఉండి

స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరుగని సమర యోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రను పాఠ్యాంశంగా పెట్టాలని పలువురు వక్తలు కోరారు. మంగళవారం కోలమూరులో క్షత్రియ యూత్, ఉండి లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లయన్ వేగేశ్న అనంతలక్ష్మి, లయన్ కన్నెగంటి రూత్ కళ, పేరిచర్ల శ్రీహరి చక్రవర్తిరాజు, లయన్ రుద్రరాజు నరసరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్ సత్తి బ్రహ్మారెడ్డి, లయన్ గొట్టుముక్కల రాము, లయన్ బొండాడ సూర్య బ్రహ్మానందం పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పెన్సిల్ బాక్స్‌లు, చాక్లెట్లు, పెద్దలకు స్వీట్లు పంచి పెట్టారు.

పాలకోడేరు : అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు పిలుపునిచ్చారు. అల్లూరి పురిటిగడ్డ అయిన మోగల్లులో వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు పెనుమత్స వెంకటరాజు (బాబు) ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం నుంచి అల్లూరి విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల రాధాకృష్ణ, పాల వెంకటస్వామి, గండి శ్రీను, హనుమంతరావు, జాలే సునీత, గౌతమ్ రాజు, బాపిరాజు, నాగారం, హరి ప్రసాద్, సూర్యనారాయణ, రవికుమార్ రాజు, కనకరాజు, బ్యాంకు బుజ్జి, గోపాల్ కష్ణంరాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.

అల్లూరి అడుగుజాడల్లో నడవాలి

అల్లూరి సీతారామరాజు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. టిడిపి ఆధ్వర్యంలో మోగల్లు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో పాల్గొని అల్లూరి విగ్రహాలకు పూలమాలసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్ఆర్‌కెఆర్ ఆధ్వర్యంలో యువత అల్లూరిని స్ఫూర్తిగా కోవాలని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణమరాజు కోరారు. అల్లూరి జయంతిని పురస్కరించుకొని కళాశాల అధ్యాపకులు కళాశాల నుంచి మోటార్ సైకిల్ ర్యాలీగా మోగల్లు గ్రామానికి వెళ్లి ఆయన స్మృతి వనం సందర్శించి నివాళులర్పించారు. ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల అల్లూరి స్మృతి వనం దత్తత తీసుకొని మొక్కలు నాటించారు. అనంతరం కళాశాల పాలకవర్గం ఉపాధ్యక్షులు ఎస్‌వి రంగరాజు జాతీయ పతాకాన్ని ఎగురవేసి అల్లూరికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ సిహెచ్ దిలీప్ కుమార్ వర్మ, ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యనారాయణ రాజు, బిహెచ్ రవికుమార్, బంగారు రాజు, రాజేష్ వర్మ పాల్గొన్నారు.

పెనుమంట్ర : అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పెనుమంట్ర పంచాయతీలోని సీతారామరాజు విగ్రహానికి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, గాదిరాజు వెంకట సాయి రామరాజు, కె.సుబ్బరాజు, జి.రవివర్మ, జి.భరత్, ఎన్.కృష్ణంరాజు, ఎం.సతీష్, ఎం.రాము పాల్గొన్నారు.

గణపవరం : అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు గణపవరం, కాశిపాడు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జూనియర్ కాలేజీ వద్ద ఉన్న సీతారామరాజు విగ్రహానికి బిజెపి నాయకులు నంద్యాల రామలింగరాజు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి కోటనాగేశ్వరరావు, ఎంపిటిసి జంపన పద్మావతి రమేష్, నేతలు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని పురస్కరించుకుని టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు నరసయ్య అగ్రహారం వద్ద అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యరాజు, టిడిపి జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మైలాబత్తుల ఐసాక్ బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మెంటే గోపి, గునుపూడి తిరుపాల్, గంటా త్రిమూర్తులు, మాదాసు కనకదుర్గ పాల్గొన్నారు.



పాలకోడేరు :అల్లూరి వేషధారణలో ఉన్న విద్యార్థితో వైసిపి యువజన విభాగం అధ్యక్షులు బాబు

కాళ్ల : కోలనపల్లి గ్రామంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెన్మత్స సుబ్బరాజును సత్కరించారు. గ్రామ సర్పంచి కొనకంచి సూర్యనారాయణమూర్తి 5 వేల రూపాయల నగదును పెన్మత్స సుబ్బరాజుకు అందజేశారు. సూర్య నారాయణమూర్తి మాట్లాడుతూ ఏటా అల్లూరి సీతారామరాజు జయంతి రోజున వృద్ధులకు ఆర్థిక సాయం చేస్తానన్నారు.

తాడేపల్లిగూడెం : అల్లూరి సీతారామరాజు త్యాగం భావి తరాలకు తెలియజేయాలని గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. ఈ సందర్భంగా ఐదు క్లబ్‌ల ప్రతినిధులతో రీజియన్ ఛైర్‌పర్సన్ మదన్‌మోహన్ అగర్వాల్, జోన్ ఛైర్‌పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, ఎఆర్‌కె.వర్మ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వంగపండు రామ్మోహనరావు, సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు పాల్గొన్నారు.

తణుకురూరల్ : నిత్య జీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకూ ప్రభుత్వ విధానాలే కారణమని, వాటిపై అల్లూరి స్ఫూర్తితో పోరాడాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక అమర వీరుల భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎ.అజయ కుమారి, సీతారామయ్య, కామన మునిస్వామి, గార రంగారావు, టి.వెంకటేశ్వరరావు, కడలి వీర్రాజు, గుబ్బల గోపి పాల్గొన్నారు.

వీరవాసరం : వీరవాసరం పోలీస్ స్టేషన్ వద్ద సిపిఎం, జనసేన ఆధ్వర్యంలో, కొణితివాడలో క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పోతుల మృత్యుంజయ, రెడ్డి రామారావు, గుండా రామకృష్ణ, ఆడ్డాల రాము, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉండి : అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను పాందువ్వ గ్రామంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు మాదాసి గోపి ఆధ్వర్యంలో మండల పరిషత్ స్పెషల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాసి గోపి మాట్లాడారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు దాగారపు గోపాలం దాతృత్వంతో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, కెవిపిఎస్ నాయకులు ఎం.ప్రశాంత్, ఇ.సుబ్రహ్మణ్యం అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

పెనుమంట్ర : మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్ వారి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ బోధనా బోధనేతర సిబ్బంది, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని గౌతమి ఉన్నత పాఠశాల ఆవరణలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు పాఠశాల ఆవరణలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు. ఆయా కార్యక్రమాల్లో వార్డు సభ్యులు పొన్నపల్లి శ్రీలక్ష్మి, నాయకులు రేవు రాంబాబు, పాఠశాల ప్రిన్సిపల్ కైలా నరేష్, కిషోర్ పాల్గొన్నారు.

ఆకివీడు : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు యువతకు స్ఫూర్తిగా నిలిచారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా దుంపగడపలోని ఎంపియుపి పాఠశాల వద్ద సీతారామరాజు కాంస్య విగ్రహానికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధనుష్, సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు బోటుపల్లి రాంబాబు, జిల్లా సహాయ కార్యదర్శి డోకల రవితేజ మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు శనపతి మోహన్‌రావు, కొండ్రోతు కృష్ణ, మోహన్ కృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలని ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోటుపల్లి శ్రీనివాసరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఉప్పుటేరు వద్ద కాటన్ పార్కులో ఉన్న అల్లూరి విగ్రహానికి, అనంతరం దుంపగడప కళాశాల ప్రాంగణంలోని విగ్రహానికి క్లబ్ సభ్యులు పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు జెడ్‌పి హైస్కూల్లో కార్యక్రమాలు నిర్వహించారు. అల్లూరి జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎస్‌కె ఎం.షరీఫ్, కోశాధికారి అనిల్, సభ్యులు నేరెళ్ల చెంచయ్య, శ్రీనివాసరాజు, దాసు సత్యనారాయణ పాల్గొన్నారు. దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల సుజాత అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

పెనుగొండ : స్థానిక ఎస్‌వికెపి కెఎస్.రాజు కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ మండల కోకన్వీనర్ కె.ఈశ్వర్ అధ్యక్షత వహించారు. ముందుగా ఎస్‌వికెపి ప్రిన్సిపల్స్ వివి.అప్పారావు అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్స్ మాట్లాడారు. ఆదివాసీల హక్కులకోసం, దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారని తెలిపారు.

పాలకొల్లు : అల్లూరి జయంతి ఉత్సవాలు క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. ఉపాధ్యక్షులు గొట్టుముక్కల భాస్కర వర్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. తొలుత పరిషత్ వద్ద అల్లూరి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. గాంధీ బొమ్మల సెంటర్ వద్ద ఆయన విగ్రహానికి నివాళు లర్పించారు. భాస్కర వర్మ, పొత్తూరి రామాంజనేయ రాజు మాట్లాడారు. కార్యక్రమంలో క్షత్రియ పెద్దలు కలిదిండి రామరాజు, కనుమూరి వెంకట రామకృష్ణంరాజు, రుద్రరాజు రామరాజు పాల్గొన్నారు.

కాళ్ల : అల్లూరి త్యాగాన్ని యువత తెలుసుకోవాలని కోపల్లె గ్రామ ఉప సర్పంచి బూడి వెంకట పట్రాలు అన్నారు. మండలంలో కోపల్లె, జక్కరం, పెదఅమిరం, కాళ్లకూరు, ఏలూరుపాడు, కలవపూడి, కోలనపల్లి గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యలమంచిలి : అల్లూరి సీతారామరాజు వేడుకలు సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని చించినాడ, యలమంచిలి, ఏనుగు వానిలంక తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడారు. యువత అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. చించినాడ ఉయ్యాల స్తంభం సెంటర్లోని అల్లూరి విగ్రహానికి డివైఎఫ్ఐ గ్రామ నాయకుడు పల్లేరు అనిల్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు, ఈ కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి, మాసవరపు సుబ్బారావు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ తెన్నేటి స్టాలిన్, ముస్కూడి రాజు, ఆకుమర్తి రాజ్ కుమార్, కేత శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ధ్రువపత్రాలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - వీరవాసరం

అవసరమైనప్పుడు ప్రభుత్వ కార్యాలయాల వద్దకెళ్లి ధృవపత్రాలు పొందే పరిస్థితి నుండి ఇంటి వద్దకే పత్రాలు అందజేసే సౌకర్యాన్ని సిఎం జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మడుగు పోలవరంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ మేలు చేసే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. అలాగే బాలేపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, సర్పంచి యర్రంశెట్టి శ్రీనివాస్, తహశీల్దార్ సుందరాజు పాల్గొన్నారు.

భీమవరం రూరల్:సంక్షేమ పథకాల అమలు ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని చినఅమిరం, భీమవరం పట్టణంలోని 15వ వార్డు, రెండో వార్డు, వీరవాసరం మండలంలోని మడుగు పోలవరం గ్రామాల్లో జరిగిన సురక్ష సభల్లో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల చదువులకు సంబంధించి ముందుగానే అన్ని సర్టిఫికెట్లూ సిద్ధం చేసుకునే విధంగా జగనన్న సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ నెల 28వ తేదీ వరకూ అమలు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాటలను ప్రజలు విశ్వసించరని, 2024 ఎన్నికల్లో వారికి భంగపాటు తప్పదని అన్నారు. అనంతరం పిల్లలకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, నాయకులు పాల్గొన్నారు.

గణపవరం : మండలంలోని గణపవరం, సరిపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచులు మూర అలంకారం, చందుమూరి లక్ష్మీదుర్గ భవాని అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల వినతులను పరిష్కరిస్తామన్నారు. అనంతరం 11 రకాల ధ్రువపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దండు రాము, కాకల శ్రీనివాసు, మండ పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు, ఉపాధ్యక్షురాలు సలాది రత్నదుర్గా కుమారి పాల్గొన్నారు.

ఉండి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.వీరస్వామినాయుడు అన్నారు. ఉప్పులూరులో నిర్వహించిన జగనన్న సురక్షలో సుమారు 520 సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వీరస్వామి నాయుడు మాట్లాడుతూ అర్హులందరూ తమ అర్హత పత్రాలను చూపించి సర్టిఫికెట్లు పొందాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఓ దాసి రాజు అన్నారు. పాలకోడేరు, మోగల్లు గ్రామ సచివాలయాల్లో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు ఇంటింటికి తిరిగి అవసరమైన వారిచే ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేయించాలన్నారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న వారికి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ దేవరకొండ అఖిల, ఎంపిడిఓ ఎస్.మురళీ గంగాధరరావు, ఉప తహశీల్దార్ సూర్య నారాయణరాజు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి - కాళ్ల

పంట కాలవల్లోకి ఆక్వా చెరువుల నీరు వదిలితే చర్యలు తప్పవని కాళ్ల మత్స్యశాఖ అధికారి ఇందిర ప్రియదర్శిని అన్నారు. కోలనపల్లి రెవెన్యూ పరిధిలోని ఆక్వా చెరువుల్లో నీరు కోమటిగుంట గ్రామం వద్ద కెలంక పంటకాలువలోకి వదలడం వల్ల తాగునీరు కలుషితమవుతోందని, నారుమడులు మాడిపోతున్నాయని కాళ్లకు చెందిన రైతులు, గ్రామస్తులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మత్స్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట కాలువలోకి నీరు వస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి ఆ మార్గాన్ని పూడ్చివేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌డిఓ మాట్లాడుతూ ఆక్వా సాగుదారులు ప్రభుత్వం నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ సత్యనారాయణ, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రొయ్యల చెరువు తవ్వకాలను ఆపాలని వినతి

యలమంచిలి:చించినాడ గ్రామంలో అరుంధతిపేట సమీపంలో రొయ్యల చెరువు తవ్వకాలను వెంటనే ఆపాలని అరుంధతిపేటకు చెందిన సంఘస్తులు తహశీల్దార్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ పేటకు సమీపంలోనే నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు రొయ్యల చెరువుల కాలుష్యం వల్ల గతేడాది తమ ప్రాంతంలోని సుమారు 50 కుటుంబాల వారు డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులకు గురై ఆస్పత్రుల పాలై లక్షల రూపాయలు వైద్యానికి ఖర్చు చేసి ప్రాణాలతో బయటపడ్డామని తెలిపారు. ఇప్పుడు అరుంధతీపేటకు మరింత చేరువలో రైతు ముదునూరి రంగరాజు పంటచేలను రొయ్యల చెరువుగా మార్చుతున్నారని తెలిపారు. ఆక్వా కాలుష్యం వల్ల మరిన్ని అంటు రాగాలు ప్రబలే అవకాశం ఉందని, పేదలమైన తమ ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని రొయ్యల చెరువు తవ్వకాన్ని వెంటనే ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.ఆంజనేయులు, తెన్నేటి స్టాలిన్, రాజు పాల్గొన్నారు.